వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి


ఇన్‌స్పెక్టర్ సైదులు

బౌద్ధనగర్: ప్రజలందరూ వినాయక చవితి నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులు ఒక ప్రకటనలో సూచించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. ప్రతీ రోజు గణేష్ మండపం వద్ద నిర్వాహకులు కచ్చితంగా ఉండాలని, రాత్రి సమయాల్లో కూడా నలుగురు మండపంలో నిద్రపోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలను నిర్వహించుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

లాలాపేటలో ఆకట్టుకుంటున్న గణనాథుడు



లాలాపేట: తార్నాక డివిజన్ డివిజన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో కొలువైన గణనాథులు భక్తుల నుంచి విశేష పూజలందుకుంటున్నాయి. ఇందులో లాలాపేటలో ఛత్రపతి శివాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంది. సోమవారం భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో చేరి వచ్చి వినాయకునికి పూజలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మధురానగర్‌కాలనీ బీజేపీ కార్యాలయంలో..

ఘనంగా గణనాథునికి పూజలు

అడ్డగుట్ట: వినాయక చవితిని పురస్కరించుకొని అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో వినాయక మండపాలు వెలిశాయి. ఈ సందర్భంగా ప్రతీరోజు గణనాథులు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. సోమవారం తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయంలోని వినాయక విగ్రహానికి ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథున్ని తమలపాకులతో అలంకరించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా రూ.19, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 40, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 55, దొండ 35, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 85, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 38, చామగడ్డ 45, మొరంగడ్డ 55, కందగడ్డ 55, సొరకాయ 17, పొట్లకాయ 28, అరటికాయ 11, మునగకాయ 5-6, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సందడి చేసిన విద్యార్థులు

ఘనంగా భాషా దినోత్సవం

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా గాయకులు, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్, గాయకుడు సుదాంష్ హాజరై మాట్లాడారు. సాంకేతికత పెరిగే కొద్దీ తెలుగు భాష ఔన్నత్యం తగ్గిపోవడం బాధాకరమన్నారు. అయితే ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా మాతృభాష తెలుగును మరవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవి జోసఫ్, ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ డీన్ మంజరి, తెలుగు విభాగాధిపతి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఖ్యాతిని ప్రతిబింబిస్తూ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే తెలుగు భాషా వైభవంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.


తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో సుద్దాల అశోక్‌తేజ, లక్ష్మణ్‌నాయక్


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

స్ఫూర్తి నింపిన 'యురేకా' చర్చలు

- సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో ఉత్సాహంగా ప్రసంగాలు

సనత్‌నగర్: ఇన్నోవేషన్ హబ్ యురేకా ద్వారా ముగ్గురు యువత తాము నెలకొల్పిన పరిశ్రమల నిర్వహణలో అవలంబిస్తున్న అధునాతన దృక్కోణాలను వివరిస్తూ సాగిన చర్చలు సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాయి. కళాశాల ఆవరణలోని భరోసా హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలర్ ప్లాస్ పాలియాడిటివ్స్ ఎల్‌ఎల్‌పీ వ్యవస్థాపకులు కమలేష్ గుప్తా, జేజీఐ స్కూల్స్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్, హేసా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకులు వంశీ ఉదయగిరిలు హాజరై తమ విజయమంత్రాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నస్రా రానియా, మిషాపేతీలు యాంకర్లుగా వ్యవహరిస్తూ అతిథుల నుంచి విద్యార్థులకు వ్యాపారం, వ్యవస్థాపకత, భవిష్యత్తుపై అవగాహన కల్పించేందుకు అర్థవంతమైన ప్రసంగాలు వెలువడేలా చక్కటి వాతావరణాన్ని కల్పించారు. అనంతరం ఈవెంట్ అధ్యక్షులు నిధి ప్రభు, ఉపాధ్యక్షులు జుహానీజైన్‌లు అతిథుల నుంచి ప్రత్యక్షంగా విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు ప్రత్యేక సెషన్‌ను నిర్వహించారు. ఈ సెషన్‌లో వాస్తవ ప్రపంచంలో వ్యాపార నిర్వహణ ఎలా సాగుతుంది, అందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, వ్యవస్థాపనకు సంబంధించి ఎదురయ్యే సవాళ్లు, అవకాశాలపై విద్యార్థినులుమకు కావలసిన సమాచారాన్ని అతిథుల నుంచి తెలుసుకున్నారు.


చర్చల్లో సంస్థల వ్యవస్థాపకులు..

మహేష్‌కుమార్ గౌడ్‌కు పలువురి అభినందనలు



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు సోమవారం నూతన టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లో విస్తతంగా ప్రచారం చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు పేదలు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాండు గౌడ్, డి. శ్రీనివాస్, మహేష్, సునీల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అనిల్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

సికింద్రాబాద్: రాజ్యసభ సభ్యుడు ఎం అనిల్ కుమార్ యాదవ్‌ను సోమవారం కలిసిన పలువురు సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ సెల్ కాంగ్రెస్ నాయకుడు వహీదుద్దీన్ నేతృత్వంలో అనిల్ కుమార్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



తాత్కాలిక తటాకాలు సిద్ధం

- నిమజ్జన ఏర్పాట్లు పూర్తి
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

చిలకలగూడ : చిలకలగూడ మున్సిపల్ మైదానంలో లక్షలాది రూపాయల వ్యయంతో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా తాత్కాలిక తటాకాలను ఏర్పాటు చేశామని, ఈ సదుపాయాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు కోరారు. చిలకలగూడ, వారాసిగూడ, మైలార్‌గడ్డ, పద్మారావునగర్, మెట్టుగూడ, నామాలగుండు, పార్శిగుట్ట, బౌద్ధనగర్, సీతాఫల్ మండి తదితర ప్రాంతాలతోపాటు ఇళ్లలో ప్రతిష్ఠించిన వేలాది వినాయక విగ్రహాలను చిలకలగూడ మైదానంలో నిమజ్జనం చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సుమారు 25 లక్షల వ్యయంతో రెండు తాత్కాలిక తటాకాలు(పాండ్స్) ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి మూడు అడుగుల ఎత్తుగల విగ్రహాలను రెడీమేడ్ ప్లాస్టిక్ పాండ్, నాలుగు నుంచి పది అడుగుల ఎత్తుగల విగ్రహాల కోసం 12 అడుగుల లోతు గల మరో పాండ్‌ను తవ్వి మంచినీటితో నింపారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్, నిష్ణాతులైన సిబ్బందిని నియమించారు.


చిలకలగూడ మైదానంలో ఏర్పాటు చేసిన రెడీమేడ్ పాండ్

చిలకలగూడ ఠాణా పరిధిలో...

చిలకలగూడ ఠాణా పరిధిలో 350 వినాయక మండపాలకు అనుమతి ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు. గణనాథుని మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ప్రత్యేక నిఘాబృందాలను రంగంలోకి దింపామని, గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కోరారు. చిలకలగూడ మైదానంలో ఏర్పాటు చేసిన నిమజ్జన తటాకాలను వినియోగించుకోవాలని సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజలు కోరారు.

పీసీసీ చీఫ్‌కు బీసీ నేతల అభినందనలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు బీసీ నేతలు అభినందనలు తెలిపారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్, రవికిరణ్, గోద రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మౌలాలి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య వ్యక్తి మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. సుమారు 40 సంవత్సరాలున్న సదరు వ్యక్తి ఒంటిపై నీలిరంగు చొక్కా, నల్లని ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8712658586 నెంబరు ద్వారా సంప్రదించాలని పోలీసులు కోరారు.

చికిత్స కోసం వచ్చి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నగరంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు పశ్చిమబెంగాల్ నుంచి నగరానికి చేరుకున్న వ్యక్తి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బెంగాల్‌కు చెందిన గోపాల్‌మజ్ముదర్ (51) కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. నగరంలో చికిత్స చేయించుకునేందుకు కుటుంబసభ్యులతో వచ్చిన గోపాల్ రైల్వేస్టేషన్ 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైన దిగగానే తీవ్ర అస్వస్థతకు లోనై మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ప్రత్యేక పూజలు

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ శ్రీ సిద్ధి వినాయక నాయక మండపంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ సోమవారం పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.సుభాష్‌నగర్‌లో కాలనీ అధ్యక్షుడు బోగి బాల్‌రాజ్ పూజలు చేశారు.


సిద్ధి వినాయకుడికి పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి


మండపంలో పూజలు చేసిన బోగి బాల్‌రాజ్

సందడిగా గ్రాండ్ పేరెంట్స్ డే



అమీర్‌పేట: రవీంద్రభారతి స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉల్లాస భరితంగా సాగింది.పిల్లలతో తమకు ఉన్న అనుభవాలను అవ్వా,తాతలు గుర్తు చేసుకున్నారు. గ్రాండ్ పేరెంట్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా తల్లిదండ్రులు పిల్లలకు దూరంగా ఉంటుండటంతో పిల్లల బాధ్యత గ్రాండ్ పేరెంట్స్‌పై పడిందని స్కూలు డీన్ ప్రియా మనీష్ అన్నారు. చిన్నారుల అవ్వా,తాతల వేషధారణ, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపక సిబ్బంధి పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ మేయర్


చిలకలగూడ నిమజ్జన పాండ్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

చిలకలగూడ : చిలకలగూడ మున్సిపల్ మైదానంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వినాయక నిమజ్జన ఏర్పాట్లను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు చోట్ల తాత్కాలిక పాండ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిమజ్జన పాయింట్ల వద్ద మౌళిక సదుపాయాలతోపాటు భద్రత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, డీఈ రంజిత్, పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉస్మానియాలో భాషా దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సైఫాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.లక్ష్మన్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలగించి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రిన్సిపల్ దేవీ జోసెఫ్, మంజరి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతివెలిగిస్తున్న ప్రొ.లక్ష్మన్‌నాయక్

బాలలక్ష్మి కి ఓయూ జేఏసీ నేతల అభినందనలు



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులుగా నియమితులైన తెలంగాణ ఉద్యమ నాయకురాలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, ఓయూ విద్యార్థిని బాలలక్ష్మీకి అభినందనలు తెలిపారు. సోమవారం బాలలక్ష్మీ కార్యాలయానికి వెళ్లిన ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు బొమ్మ హనుమంతు, డాక్టర్, దేశగాని సాంబశివగౌడ్ బాలకృష్ణ తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తి పారవశ్యం


బీకేగూడలో గణనాథుడిని దర్శించిన వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వాడవాడలా వీధివీధినా వెలసిన మంటపాల్లో కొలువుదీరిన పార్వతీసుతుడి సేవలో భక్తులు పునీతులవుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్లలో గణేష్ ఉత్సవ సందడితో వీధులన్నీ శోభిల్లుతున్నాయి. పలుచోట్ల గణనాథుల మంటపాల వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు...

మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నృత్యాంజలి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ గురు శృతికిరణ్ శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. శ్రావ్యమైన సంగీతానికి సంప్రదాయ నృత్యరీతులు జోడించి కట్టిపడేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి తదితరులు పాల్గొన్నారు.


బేగంపేటలో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, విశాల్ సూదం, అడపా అభిషేక్


మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో చిన్నారుల సంప్రదాయ నృత్యాలు


బీకేగూడ వద్ద కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ పీవీ రవిశేఖర్‌రెడ్డి

'గాంధీ'లో ప్రత్యేక పూజలు



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో గణనాథుని వేడుకలు ఘనంగా కొనసాగు తున్నాయి. ఆస్పత్రి ప్రాంగణంలోని సాయిబాబా ఆలయం వద్ద టీఎన్‌జీవో ప్రతినిధులు ప్రతిష్ఠించిన గణనాథుని మండపంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఆర్ఎంఓ-1 శేషాద్రిలు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీఎన్‌జీవో గాంధీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, ప్రసన్న ఆనంద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మినీ, టీఎన్‌జీవో ప్రతినిధులు జనార్ధన్, శ్రవణ్, సత్యనారాయణ, సరళ, భావన, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట: వినాయక చవితి వేడుకల్లో భాగంగా తార్నాకలోని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి నివాసంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతికి సోమ వారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

